క్లుప్తంగా

ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న అధికారులను సస్పెండ్ చేయాలి

కైలాస్‌నగర్: ఎమ్మెల్యే పాయల్ శంకర్ అండతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రజా సేవాభవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బేల మండల కేంద్రంలో జరిగిన దండారీ చెక్కుల పంపిణీలో అధికారుల నిర్లక్ష్యాన్ని తప్పుపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న చెక్కుల పంపిణీలో సీఎం, మంత్రుల ఫొటోలు, బ్యానర్ లేకుండా ఎలా పంపిణీ చేస్తారని ప్రశ్నించారు. వెంటనే సంబంధిత అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. సదరు అధికారులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్, ఐటీడీఏ పీవోలను కోరారు. సమావేశంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, నాయకులు గిమ్మ సంతోష్ రావు, లోక ప్రవీణ్ రెడ్డి,, కౌన్సిలర్లు బండారి సతీశ్, సంద నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సోయా కొనుగోళ్లు

ఇచ్చోడ: వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం నుంచి సోయా కొనుగోళ్లు యథావిధిగా కొనసాగనున్నట్లు మార్కెట్ కార్యదర్శి రమేశ్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ దీపావళి సందర్భంగా మూడు రోజుల పాటు కొనుగోళ్లు నిలిపివేశామన్నారు. శనివారం నుంచి ప్రతీరోజు ఉదయం నుంచే కొనుగోళ్లు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఇందిరాగాంధీ సేవలు చిరస్మరణీయం

ఉట్నూర్‌రూరల్: మాజీ ప్రధాని ఇందిరాగాంధీ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. గురువారం ఉట్నూర్‌లోని క్యాంప్ కార్యాలయంలో ఇందిరాగాంధీ 40వ వర్ధంతిని నిర్వహించారు. ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు ఖయ్యూం, ఎక్బాల్, చంద్రయ్య, తిరుపతి, యూసూఫ్, రాజేశ్వర్ పాల్గొన్నారు.

'జిల్లా మహాసభలు జయప్రదం చేయండి'

ఎదులాపురం: జిల్లా కేంద్రంలో ఈ నెల 28, 29 తేదీల్లో నిర్వహించనున్న సీపీఎం జిల్లా 13వ మహాసభలను విజయవంతం చేయాలని పార్టీ రాష్ట్ర నాయకులు బండారు రవికుమార్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవనంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పార్టీ జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేశ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లంక రాఘవులు, పూసం సచిన్, అన్నమొల్ల కిరణ్, సీనియర్ నాయకులు దత్తాత్రి, జిల్లా కమిటీ సభ్యులు ఆత్రం కిష్టన్న, బొజ్జ ఆశన్న, ఎం.గంగన్న సురేందర్, మంజుల పాల్గొన్నారు.

దండారీ చెక్కుల పంపిణీలో ఫ్లెక్సీ వివాదం

బేల: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గల సమావేశ మందిరంలో గురువారం దండారీ చెక్కుల పంపిణీలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కల ప్రభుత్వ ఫ్లెక్సీ లేకపోవడంతో వివాదం చోటుచేసుకుంది. ఐటీడీఏ పీవో ఆదేశానుసారం సైద్‌పూర్ స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం జాదవ్ గణేశ్, ఎస్ఈఆర్‌పీ మడావి శంకర్‌లు 34గ్రామాలకు చెందిన దండారీ గ్రూపులకు చెక్కులు అందజేసేందుకు వచ్చారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్ వచ్చిన క్రమంలో కాంగ్రెస్ నాయకులు ప్రభుత్వ ఫ్లెక్సీ ఎందుకు ఏర్పాటు చేయలేదని నిలదీశారు. చెక్కుల పంపిణీలో ప్రభుత్వ ఫ్లెక్సీలు అవసరం లేదని ఎస్ఈఆర్‌పీ శంకర్ సమధానం ఇవ్వడంతో వివాదం ప్రారంభమైంది. ఈ క్రమంలో బీజేపీ, కాంగ్రెస్ నాయకుల మధ్య వాగ్వాదం, తోపులాట జరిగింది. సీఐ సాయినాథ్, ఎమ్మెల్యే ఇరువర్గాలను సముదాయించారు. అనంతరం స్టేజీపై నాయకులు ఎవరిని ఉండనీయకుండా ఎమ్మెల్యే, అధికారులు కలిసి చెక్కులు పంపిణీ చేశారు.

ఆటో డ్రైవర్‌పై పోక్సో నమోదు

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ కాలనీకి చెందిన 17 ఏళ్ల బాలికను లైంగికంగా వేధింపులకు గురి చేసిన ఓ ఆటో డ్రైవర్‌పై పోక్సో కేసుతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ జీవన్ రెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని బాలిక పట్టణంలోని ఓ షాపులో ఉద్యోగం చేస్తుంది. రోజూ మాదిరిగానే విధులు ముగించుకొని గత నెల 30న సాయంత్రం ఇంటికి వెళ్తుండగా మార్గమధ్యలో ఓ పెట్రోల్ పంపు సమీపంలో ఆటో డ్రైవర్ ఆమెను ఆపి మాట్లాడాల్సి ఉందని చెప్పి ఆటో ఎక్కించుకున్నాడు. బాలిక రాత్రి అయినా ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు కిడ్నాప్ అయ్యిందని ఫిర్యాదు చేశారు. మరుసటి రోజు బాలిక ఇంటికి చేరుకొని కుటుంబ సభ్యులకు విషయం తెలపడంతో ఆటోడ్రైవర్ నిర్వాకం బయటపడింది. కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయడంతో సదరు ఆటో డ్రైవర్‌ను అరెస్టు చేసి గురువారం రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ పేర్కొన్నారు.



ఇంద్రవెల్లి: నాగోబా ఆలయం వద్ద సంప్రదాయ నృత్యం చేస్తున్న మహిళలు



సిరికొండ: గుస్సాడీల సంప్రదాయ నృత్యం

వైభవంగా దండారీ ఉత్సవాలు

- గూడేల్లో కొనసాగుతున్న వేడుకలు
- చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యేలు



ఆదిలాబాద్‌రూరల్: ఎమ్మెల్యే పాయల్ శంకర్‌ను సన్మానిస్తున్న ఆదివాసీలు



బజార్‌హత్నూర్: చింతలసాంగ్వీలో నృత్యం చేస్తున్న గిరిజనులు



ఆదిలాబాద్‌రూరల్: దండారీ ఉత్సవాల్లో పాల్గొన్న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న



బోథ్: పాల్గొన్న మాజీ ఎంపీపీ శ్రీనివాస్

ఇచ్చోడ: మండలంలోని మాన్కుగూడలో శుక్రవారం దండారీ ఉత్సవాలు కొనసాగాయి. దీపావళి సందర్భంగా పటేల్ ఇంటి వద్ద గుస్సాడీలతో కలిసి గ్రామస్తులు సంప్రదాయ నృత్యాలు చేశారు. కార్యక్రమంలో ముఖరాబీ మాజీ సర్పంచ్ అడమ్‌మారుతి, గ్రామ పటేల్ అడభీంరావు, దేవారి భీంరావు, పూజారి గంగారాం, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉత్సవాల్లో పాల్గొన్న రామన్న..

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని అంకాపూర్, చిన్న మాలే బోరిగాం గ్రామాలలో ఏర్పాటుచేసిన దండారీ ఉత్సవాలలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో తెలంగాణ సంస్కృతిక పండుగలు శోభతప్పుతున్నాయన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ దీపావళి, దసరా, బతుకమ్మ, ఇతర పండుగలకు ప్రోత్సహకాలను ముందుగానే అందజేసి పండుగలు వైభవంగా జరుపుకునేలా కృషి చేశారన్నారు. గుస్సాడీలకు కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 15వేలు ఇవ్వడాన్ని అభినందిస్తున్నామన్నారు. మాజీ ఎంపీపీ గండ్రత్ రమేశ్, మాజీ మార్కెట్ చైర్మన్ మెట్టు ప్రహ్లాద్, బీఆర్‌ఎస్ పార్టీ ఉపాధ్యక్షుడు నారాయణ, నాయకులు కుమ్ర రాజు, పరమేశ్వర్, అప్కం గంగయ్య, వెంకటేశ్, సతీశ్, విఠల్, దేవన్న, రాము, పవన్, తదితరులు పాల్గొన్నారు.

బేల: కాంగ్రెస్ ప్రభుత్వం దండారీలకు రూ.15వేలు అందజేయడాన్ని స్వాగతిస్తామని జోగు రామన్న పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని వడగూడ, జంగుగూడ, మశాల(బి), సదల్‌పూర్, పోనాల, తదితర గ్రామాల్లో దండారీ ఉత్సవాల్లో పాల్గొన్నారు.

నాగోబా ఆలయంలో..

ఇంద్రవెల్లి: ఆదివాసీల ఆరాధ్యదైవం కేస్లాపూర్ నాగోబా ఆలయంలో శుక్రవారం దండారీ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. మండలంలోని చిత్తబట్ట, హీరాపూర్ గ్రామాలతో పాటు ఇచ్చోడ మండలంలోని రాయిగూడ, ఉట్నూర్ మండలంలోని కన్నాపూర్ గ్రామాలకు చెందిన ఆదివాసీ మహిళలు దండారీగా నాగోబా ఆలయానికి తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల మహిళలు, గుస్సాడీలు పోటాపోటీగా చేసిన సంప్రదాయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్, ఆయా గ్రామాల ఆదివాసీ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

దండారీ ఉత్సవాల్లో పాల్గొన్న ఎంపీ

ఇంద్రవెల్లి మండలంలోని తెజాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని మోహన్‌గూడ గ్రామంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన దండారీ ఉత్సవాల్లో ఎంపీ గోడం నగేశ్ పాల్గొన్నారు. ఆదివాసీలు సంప్రదాయ వాయిద్యాలతో ఎంపీకి స్వాగతం పలికారు. ముందుగా ఏత్మసూర్ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కుకున్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు ఆరెల్లి రాజలింగు, బీజేపీ నాయకులు కనక హనుమంత్‌రావ్, మెస్రం తుకారం, కనక తుకారం, దేవ్‌పూజే మారుతి, దిలీప్ మోరే, మస్కే రాజువర్ధన్, సోయం వినోద్, బాలే సునీల్ తదితరులు ఉన్నారు.

బోథ్: ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సహకారంతో బోథ్ మండల అభివృద్ధి జరుగుతుందని మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని జైతుగూడ, కేశవ్‌గూడ, మహదుగూడ గ్రామాల్లో నిర్వహించిన దండారీ ఉత్సవాల్లో పాల్గొన్నారు. గ్రామస్తులు వారికి గుస్సాడీ నృత్యంతో స్వాగతం పలికారు. మాజీ సర్పంచ్ శ్రీధర్‌రెడ్డి, సురేందర్ యాదవ్, కిషన్, బొడ్డు శ్రీనివాస్, అల్లకొండ ప్రశాంత్, ఇర్ల అభిలాష్, సుధీర్ రెడ్డి, తుల హరీశ్, సోమన్న, భీంరావ్, చిన్నయ్య, మృణాల్ గౌడ్, ఎప్తేకార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉత్సవాల్లో పాల్గొన్న రైల్వే బోర్డు సభ్యులు

మండలంలోని పార్డి కె గ్రామంలో శుక్రవారం నిర్వహించిన దండారీ ఉత్సవాల్లో సౌత్ రైల్వే బోర్డు సభ్యులు జి. వి. రమణ, బీజేపీ మండల అధ్యక్షుడు బోరె రవీందర్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు వారిని శాలువాతో సత్కరించారు. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు చాల గొప్పవని వారు అన్నారు.

బజార్‌హత్నూర్: ఆదివాసీ గిరిజనులు పవిత్రంగా జరుపుకునే దండారీ ఉత్సవాలను గురువారం, శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మండలంలో జాతర్ల, మాడగూడ, చింతలసాంగ్వీ, ఉప్పర్‌పల్లి, గిరిజాయి, డేడ్ర, ఉమార్ద, అందుగూడ, కొత్తపల్లి, ఎల్లయ్యపల్లి, రాంపూర్ గ్రామాల్లో ఆదివాసీ గిరిజనులు నియమనిష్టలతో దండారీ పండుగ జరుపుకున్నారు.

సిరికొండ: మండలంలోని గిరిజన గ్రామాల్లో దండారీ ఉత్సవాలు అంబరాన్నంటాయి. మండలంలోని సుంకిడి, రాయిగూడ, రిమ్మ, జాకీర్‌గూడ, కోసుపటేల్ గూడ, వాయిపేట్, తిమ్మాపూర్ గిరిజన గ్రామాల్లో దండారీ ఉత్సవాలను జరుపుకున్నారు.

దండారీ ఉత్సవాల్లో ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్‌రూరల్: దండారీ ఉత్సవాల్లో భాగంగా ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ శుక్రవారం మండలంలోని చిన్న మలేబోరిగాం, పెద్ద మలే బోరిగాం గ్రామాల్లో పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో పాల్గొన్న ఆయనను ఆదివాసీలు సాంప్రదాయబద్ధంగా ఘనంగా స్వాగతం పలికి శాలువతో సత్కరించారు.

సంస్కృతిని మరువొద్దు

ఇంద్రవెల్లి: తరతరాలుగా ఉన్న సంస్కృతి, సంప్రదాయాలను మరువొద్దని, వాటిని భావితరాలకు అందించే బాధ్యత అందరిపై ఉందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని గొండ్‌గూడతో పాటు మండలంలోని గ్రామాల్లో పర్యటించి దండారీ ఉత్సవాల్లో పాల్గొన్నారు. ముందుగా ఆయా గ్రామాల్లో ఆదివాసీలు ఘన స్వాగతం పలికారు. ఏత్మసూర్ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దండారీ ఉత్సవాలు నిర్వహించడానికి ప్రభుత్వం మంజూరు చేసిన రూ.15 వేల చెక్కులను దండారీ నిర్వాహకులకు పంపిణీ చేశారు. ఆయా గ్రామాల్లో దండారీ బృందంతో కలిసి సంప్రదాయ నృత్యాలు చేశారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముఖడే ఉత్తం, నాయకులు ఎండీ మసుద్, సోమోరే నాగోరావ్, కొరెంగా సుంకట్‌రావ్, గ్రామ పటేల్ మడావి ఇంద్రు, గ్రామ పెద్దలు చహకటి నాగోరావ్ తదితరులు ఉన్నారు.



ఏత్మసూర్ దేవతలకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్

దండారీలకు చెక్కులు పంపిణీ..



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి

తాంసి: గిరిజనులు తమ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం తరపున గుస్సాడీలకు అందించే చెక్కుల పంపిణీకి బోథ్ ఎమ్మెల్యే హాజరయ్యారు. డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డితో కలిసి తాంసి, భీంపూర్ మండలాలకు చెందిన 42 దండారీలకు రూ.15వేల చొప్పున చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐటీడీఏ అధికారులు రాజశేఖర్, సంటెన్న, మాజీ జెడ్పీటీసీ సుధాకర్, మాజీ ఎంపీపీ శ్రీధర్ రెడ్డి, తాంసి గ్రామ మాజీ సర్పంచ్ కృష్ణ, గిరిజన పెద్దలు మడావి లింబాజీ, భరత్, శ్రీకాంత్, యశ్వంత్, మండల నాయకులు సంతోష్, అనిల్, రఘు, రమణ, మహేందర్ పాల్గొన్నారు.

నేరడిగొండలో..

నేరడిగొండ: దండారీ ఉత్సవాల్లో భాగంగా మండలంలోని లఖంపూర్ గ్రామంలో గురువారం నిర్వహించిన కార్యక్రమానికి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జా దవ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గ్రామస్తులు దండారీ నృత్యాలతో ఆయనకు ఘన స్వాగతం పలి కారు. ఈ సందర్భంగా గ్రామంలో ఒక్కొక్కటి రూ. 15 వేల విలువ గల 11 దండారీ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దండారీని గిరిజనులకు పరిచయం చేసిన కనకరాజు లేకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ఆయన వెంట మండల నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఘనంగా దీపావళి వేడుకలు



ఇంద్రవెల్లి: ఆవును కానుకగా అందిస్తున్న ఆదివాసీలు



కైలాస్‌నగర్: లక్ష్మీపూజ చేస్తున్న కంది దంపతులు



నార్నూర్: గోమాతకు నైవేద్యం తినిపిస్తున్న భక్తులు

నార్నూర్/ఉట్నూర్‌రూరల్ /ఇంద్రవెల్లి/కైలాస్‌నగర్/ఆదిలాబాద్/సిరికొండ: దీపావళి పండుగను జిల్లాలోని ఆయా మండలాల్లో ఘనంగా జరుపుకున్నారు. ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ కల్లూరిగూడ గ్రామంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలు ఇళ్లల్లో, దుకాణాల్లో ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. దీపావళి పురస్కరించుకొని ఆదివాసీలు మహాలక్ష్మి పూజ అనంతరం ఆవులకు ప్రత్యేక పూజలు చేసి నైవైద్యం సమర్పించారు. ఆదిలాబాద్ పట్టణంలోని ప్రజాసేవభవన్‌లో ఘనంగా జరుపుకున్నారు. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్ రెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని సంజయ్ నగర్ కాలనీలో బెంగాలీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన కాళికామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



ఆదిలాబాద్: కాళీమాతకు పూజలు నిర్వహిస్తున్న బెంగాలీలు



ఉట్నూర్‌రూరల్: కల్లూరిగూడ గ్రామంలో ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే

ప్రారంభమైన సామాజిక సర్వే

సిరికొండ: మండల కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, రాజకీయ సర్వేను ఎన్యూమరేటర్లు శుక్రవారం ప్రారంభించారు. తొలిరోజున హౌస్ లిస్టింగ్‌ను ప్రారంభించారు. సర్వేకు నియమించిన ఎన్యూమరేటర్ ప్రతి ఇంటికి వెళ్లి యజమాని పేరుతో ఉన్న స్టిక్కర్‌ను ఇంటికి అతికిస్తున్నారు. కార్యక్రమాన్ని మండల ప్రత్యేక అధికారి డీఎల్‌పీవో ఫణీంధర్ పాల్గొని ఇంటికి వచ్చే ఎన్యూరేటర్‌కు పూర్తి సహకారం అందించాలని ప్రజలను కోరారు. తహసీల్దార్ తుకారం, ఎంపీవో సంతోష్ కుమార్ సర్వేను పరిశీలించారు.

బోథ్: ఈ నెల 6వ తేదీ నుంచి ప్రారంభం కానున్న సమగ్ర ఇంటింటి సర్వే నేపథ్యంలో సర్వే అధికారులు, సిబ్బంది శుక్రవారం ఇంటింటికీ వెళ్లి ఇంటి జాబితా తయారు చేశారు. మండల వ్యాప్తంగా 33 గ్రామ పంచాయతీల్లో 132 మంది ఎన్యూమరేటర్లు ఇంటింటి జాబితా తయారు చేస్తున్నారు. మండల ప్రత్యేకాధికారి వాజీద్ అలీ, ఎంపీడీవో రమేశ్ ఉన్నారు.

నార్నూర్: ప్రభుత్వం చేపడుతున్న సామాజిక, ఆర్థిక, కుటుంబ సర్వేను శుక్రవారం ప్రారంభించారు. మండల కేంద్రంలోని విజయ్‌నగర్‌కాలనీలో సూపరిటెండెంట్ గంగాసింగ్ సర్వే నిర్వహించారు. తాడిహత్నూర్, భీంపూర్, నాగల్‌కొండ గ్రామాల్లో సర్వేను ఎంపీడీవో జవహర్ ప్రారంభించారు.

క్రైం కార్నర్..



బైక్ దొంగ రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: ద్విచక్ర వాహనాల దొంగతనానికి పాల్పడుతున్న వ్యక్తిని పట్టుకొని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. శుక్రవారం టూటౌన్ పోలీసుస్టేషన్‌లో సీఐ కరుణాకర్‌రావు వివరాలు వెల్లడించారు. క్రాంతినగర్‌కు చెందిన పాత నేరస్తుడు నర్వాడే గంగాధర్ జల్సాలకు అలవాటుపడి దొంగతనాలకు పాల్పడుతున్నాడు. టూటౌన్ పరిధిలో ఓ వ్యక్తి మూత్రవిసర్జనకు వెళ్లగా నిలిపి ఉన్న వాహనాన్ని ఎత్తుకెళ్లాడు. రిమ్స్ ఉద్యోగికి సంబంధించిన వాహనాన్ని, వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో పార్కింగ్ చేసిన వాహనాన్ని ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. నిందితుడిని పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. ఎస్సై విష్ణుప్రకాష్, హెడ్‌కానిస్టేబుల్ వినయ్, సిబ్బంది మహేందర్, ప్రవీణ్, రమేశ్ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో ఇద్దరి రిమాండ్

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని తంతోలి రోడ్డు మార్గంలో గల ఓ వాటర్ ప్లాంట్‌లో వర్కర్‌గా పని చేస్తున్న రవిపై దాడి చేసి, కులం పేరుతో దూషించిన ఇద్దరిని శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ జీవన్ రెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. గత నెల 23న వర్కర్ రవిపై పట్టణంలోని శాంతినగర్ కాలనీకి చెందిన ముగ్గురు వ్యక్తులు దాడి చేయడంతో పాటు కులం పేరుతో దూషించారు. అందులో ఏ1 ఎంఏ శోయబ్, ఏ3 ఎంఏ నసిర్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

బైక్ అదుపుతప్పి ఇద్దరికి తీవ్ర గాయాలు

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడి ఇద్దరు తీవ్ర గాయాలపాలయ్యారు. బేల మండలంలోని దహెగాంకు చెందిన గజ్జు, సతీశ్‌లు ఆదిలాబాద్ నుంచి బేల వైపు వెళ్తున్న క్రమంలో జైనథ్ మండలంలోని భోరజ్ చెక్‌పోస్టు సమీపంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పింది. దీంతో కిందపడడంతో గాయాలపాలయ్యారు. స్థానికులు గమనించి 108కు సమాచారం అందించారు. చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు.

శతాధిక వృద్ధురాలు మృతి

బోథ్: మండల కేంద్రానికి చెందిన పీఏసీఎస్ డైరెక్టర్ చట్ల ఉమేష్ అమ్మమ్మ చట్ల లక్ష్మీబాయి (100) శుక్రవారం మృతి చెందింది. మృతి చెందిన నాటికి ఆమె వయసు 100 సంవత్సరాలు.

సంక్షిప్త వార్తలు

నూతన ఎంపీడీవో శంకర్ బాధ్యతలు స్వీకరణ

సిరికొండ: నూతన మండల పరిషత్ అధికారిగా శంకర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇన్‌చార్జి ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న రవీందర్ స్థానంలో శంకర్ బాధ్యతలు స్వీకరించారు.

భీంపూర్ టీయూటీఎఫ్ అధ్యక్షుడిగా శివారెడ్డి

తాంసి: భీంపూర్ మండల శాఖ టీయూటీఎఫ్ అధ్యక్షుడిగా శివారెడ్డిని శుక్రవారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి జలంధర్ ఆధ్వర్యంలో మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా శివారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సత్యనారాయణ, కోశాధికారిగా ప్రీతం, కార్యవర్గ సభ్యులుగా రాజు, కుసుమ, విజయలక్ష్మి, కాంచన, మహేశ్వర్‌రావులను ఎన్నుకున్నారు.

వర్షంతో తడిసిన సోయా పంట

బోథ్: మండలంలో శుక్రవారం కురిసిన వర్షానికి మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ కార్యాలయ ఆవరణలోని సోయా పంట, కొనుగోలు కేంద్రంలోని సోయా పంట తడిచింది. మండలంలోని ధన్నూర్ బి, కౌఠ బి, కనుగుట్టతో పాటు పలు గ్రామాల్లోని వ్యవసాయ క్షేత్రాల్లో ఉన్న సోయా పంట తడిచిపోయింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తడిచిన సోయా పంటను ఎలాంటి ఆంక్షలు లేకుండా ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని నిషాన్‌ఘాట్ శివారు ప్రాంతంలో పేకాట ఆడుతున్న పలువురిని శుక్రవారం అరెస్టు చేసినట్లు ఎస్సై ముజాహిద్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. నిషాన్‌ఘాట్ శివారులో పేకాట ఆడుతున్న ఆదిలాబాద్ పట్టణానికి చెందిన 9 మందిని పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.9వేల నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఏఐటీయూసీ ఆవిర్భావ వేడుకలు

ఎదులాపురం: ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటీయూసీ) 105వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. అంతకుముందు అమరవీరులకు నివాళులు అర్పించారు. అనంతరం యూనియన్ జెండా ఎగురవేశారు. నాయకులు దేవేందర్, రాజు, రాములు, చందు, చిరంజీవి, ముజీబ్, ఖాసిం, సంగీత, డేవిడ్, వామన్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి విజేతలకు సన్మానం

ఉట్నూర్‌రూరల్: మహబూబ్‌నగర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ ఖోఖో పోటీల్లో ఉట్నూర్ గిరిజన క్రీడా పాఠశాల విద్యార్థులు విజేతలుగా నిలిచారు. విద్యార్థులను గురువారం ఉట్నూర్ కేబీ కాంప్లెక్స్ మైదానంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ వసంతరావు ఘనంగా సన్మానించారు. జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, పీఈటీజీ ఏపీవో మెస్రం మనోహర్, ఏసీఎంవో జగన్, కోచ్‌లు శివకృష్ణ, రవీందర్, సాగర్, మినాక్షి, పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

స్మారక సభలు జయప్రదం చేయండి

ఎదులాపురం: ఈనెల 9వ తేదీ వరకు నిర్వహిస్తున్న స్మారక సభలను జయప్రదం చేయాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వెంకట నారాయణ పిలుపునిచ్చారు.

కళాకారుడిని అభినందించిన పీవో

ఉట్నూర్‌రూరల్: గోండు చిత్ర కళాకారుడు మడావి రాజేశ్వర్, మడావి ఆనంద్‌రావులు సంకల ఫౌండేషన్ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో నిర్వహించిన చిత్రకళా ప్రదర్శన మేళాలో పాల్గొని అత్యున్నత ప్రతిభ కనబరిచి, దీపావళి పండుగ ప్రత్యేకతను వివరించి రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకోవడంపై ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా కళాకారులను ఐటీడీఏ కార్యాలయంలో అభినందించారు.

డీఎంహెచ్‌వో కృష్ణకు వీడ్కోలు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిగా పనిచేస్తున్న డాక్టర్ కె.కృష్ణ మహబూబ్‌నగర్ జిల్లాకు డిప్యూటేషన్‌పై వెళ్తున్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్‌ను కలిసి రిలీవ్ అయ్యారు. అనంతరం కార్యాలయ ఉద్యోగులు ఆయనను శాలువతో సన్మానించారు. పీవోడీటీగా పనిచేస్తున్న డాక్టర్ నరేందర్ రాథోడ్ ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోగా విధులు నిర్వహించనున్నారు. సూపరింటెండెంట్ గోపి, ఉద్యోగులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో సంజన

ఆదిలాబాద్: జిల్లా కేంద్రానికి చెందిన నృత్యకారిణి అవరగొండ సంజన హైదరాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని ప్రదర్శన ఇచ్చినట్లు శిక్షకుడు రవి తెలిపారు. విజేతలను త్వరలో ప్రకటించనున్నట్లు వెల్లడించారు.